క్లుప్తంగా

వర్షాలకు దెబ్బతిన్న పాఠశాల భవనాలు



శ్లాబ్ దెబ్బతిన్న దిబ్బలపాలెం ఎంపీపీ పాఠశాలను సందర్శించిన ఎస్ఎస్ఏ ఏఈ సత్యనారాయణ

రోలుగుంట: ఇటీవల భారీ వర్షాలకు మండలంలో గల పాత పాఠశాల భవనాలు దెబ్బతిన్నాయి. వాటిని సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించి నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖ రోలుగుంట మండల ఏఈ పి.వి.సత్యనారాయణ మంగళవారం మండలంలో గల దిబ్బలపాలెం, అర్ల, వెలంకాయలపాలెం, గుర్రాలబయలు, రాజన్నపేట తదితర పాఠశాలలను సందర్శించారు. దెబ్బతిన్న పాఠశాలల వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా చోట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని ఏఈ విలేకరులకు తెలిపారు.

విజయవాడ వరద బాధితులకు వీఎస్సార్ సహాయం



విజయవాడలో వరద బాధితులకు వస్తువులు అందిస్తున్న వీఎస్సార్ సభ్యులు

బుచ్చెయ్యపేట: విజయవాడ వరద బాధితులకు బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన వీఎస్సార్ సేవా సంస్థ సభ్యులు నిత్యవసర వస్తువులు అందించారు. మంగళవారం సేవా సంస్థ సభ్యులు వడ్డి సత్యారావు,అచ్చింనాయుడు,జగడాల వెంకట మణి, ముత్యాలనాయుడు తదితరులు పలువురి సహాయంతో విజయవాడలో వరద బాధితులకు నిత్యవసర వస్తువులు అందించడానికి బయలుదేరి వెళ్లారు. సింగ్‌నగర్ దగ్గర వైఎస్సార్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసం ఉండి నీటి ముంపునకు గురైన 300 మంది కుటుంబాలకు దుప్పట్లు, 8 రకాల నిత్యవసర వస్తువులు అందించారు.

ఇంకా ఉధృతంగా వరహానది

గొలుగొండ: వర్షం తగ్గుముఖం పట్టినా గెడ్డల ప్రవాహం ఎక్కడా తగ్గలేదు. మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా బొడ్డేరు, ధారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, వరహానది, పాలగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం వీటి ప్రవాహం ఎక్కడా తగ్గలేదు. లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగిన వరి పంట ఇంకా తేరుకోలేదు. గెడ్డల నుంచి ప్రవహిస్తున్న వరదనీరు తాండవ జలాశయానికి భారీగా చేరుతుంది. నీట మునిగిన వరి పంటకు కాలువలు ఏర్పాటు చేసి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు.

రెండు గ్రామాల్లో అన్న సమారాధన

గొలుగొండ : వినాయక ఉత్సవాలు సందర్భంగా మంగళవారం ఎర్రవరం, జోగుంపేట గ్రామాల్లో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో మధ్యాహ్నం సుమారుగా 3వేల మందికి కమిటీ సభ్యులు అన్న సమారాధన ఏర్పాటు చేయగా సమీప గ్రామాలు చీడిగుమ్మల, పోలవరం, ఎరకంపేట, వెంకటాపురం, కొత్త జోగుంపేట, సాలికమల్లవరం తదితర గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తక్కువ వ్యయంతో అధిక పోషకాహారం



కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమణమ్మ

మాడుగుల రూరల్: తక్కువ వ్యయంతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ, ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వి.రమణమ్మ పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా, కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహారం ఆవశ్యకత గురించి బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆకు కూరలు, బెల్లం, మునగ ఆకు, అటుకులు, తెలగపిండితో చేసిన ఆహారం తీసుకోవాలని, బాలామృతం కూడా ఎంతో శ్రేష్ఠమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తక్కువ వ్యయంతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకళ, వెంకటలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.



వడ్డాది శిథిల వంతెనపై నుండి భారీ వాహనాలు నిలిపివేయడంతో వెనుదిరిగి పోతున్న లారీలు



విజయరామరాజుపేటలో గండి పడ్డ తాచేరు డైవర్షన్ రోడ్డు వద్ద తగ్గిన వరద నీరు



రోడ్డు మీద నుండి నీరు ప్రవహించడంతో కోతకు గురైన డైవర్షన్ రోడ్డు

హమ్మయ్య.. వరద తగ్గింది

- వడ్డాదిలో ముంపు నుంచి బయటపడ్డ డైవర్షన్ రోడ్డు
- కోతకు గురైన రహదారి
- వర్షాలు తగ్గడంతో తేరుకుంటున్న జనం



వడ్డాది పెద్దేరు నదిలో నీరు తగ్గడంతో బైటపడ్డ డైవర్షన్ రోడ్డు

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలంలో వరద ఉధృతి తగ్గింది. వర్షం తగ్గుముఖం పట్టడంతో మండల ప్రజలు,రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజుల తరవాత వర్షం తగ్గి ఎండ కాసింది. మేజర్ పంచాయితీ వడ్డాది పెద్దేరు నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో నీటిలో మునిగిపోయిన డైవర్షన్ రోడ్డు మంగళవారం బయట పడింది. అయితే వరద ఉధృతికి రోడ్డు కోతకు గురైంది. డైవర్షన్ రోడ్డుపై నుంచి వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. శిథిలమైన వంతెనపై నుంచి చిన్న వాహనాలు తప్ప భారీ వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో పలువురు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేటలో తాచేరు నదిపై గండిపడ్డ డైవర్షన్ రోడ్డు వద్ద నీటి ప్రవాహం తగ్గింది. వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల వద్ద డైవర్షన్ రోడ్లు రెండు గండ్లు పడడంతో వాహనాల రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ,పాడేరు,నర్సీపట్నం,అనకాపల్లి, చోడవరం,మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు కార్లు,జీపులు ఇతర వాహనాలకు పాట్లు తప్పడం లేదు. ఇరుకుగా ఉండే గౌరీపట్నం,కోనాం,పీఎస్‌పేట రహదారుల్లో రాకపోకలు సాగిస్తూ ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోయి నానా అవస్థలు పడుతున్నారు. నర్సీపట్నం నుంచి చోడవరం తిరిగే ఆర్టీసీ బస్సులు వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆర్చ్ వద్ద ఆపేస్తున్నారు. దీంతో దూర ప్రయాణాలు చేసేవారు కిలోమీటరు దూరంలో ఉన్న నాలుగురోడ్ల జంక్షన్ వరకు నడిచి అక్కడ నుండి వేరే వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వడ్డాది, విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్లు వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో వెంటనే గండ్లు పూడ్చి రవాణా సదుపాయం కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు. పల్లపు ప్రాంతాల పంట పొలాల నుంచి వరద నీరు బయటకు పోవడంతో పంటలు తేరుకుంటున్నాయి.

రైవాడ పరిసర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, బూరె బాబురావు

దేవరాపల్లి : రైవాడ జలాశయాన్ని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబురావు తదితర సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మంగళవారం సందర్శించారు. రెండు రోజులు పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జలాశయంలోకి వరదనీరు పోటెత్తింది. జలాశయం స్విల్వే గేట్లు, స్లూయిస్ వద్దకు చేరు ప్రస్తుత నీటిమట్టం, నీటి నిల్వల స్థితిగతులను స్థానిక ఇరిగేషన్ అధికారులను వారు అడిగి తెలుసుకున్నారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 111.80 మీటర్ల ఉందని, జలాశయంలోకి 1000 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం మాట్లాడుతూ జలాశయం ప్రమాద స్థాయికి చేరువలో ఉండడంతో ఏ క్షణంలోనైన స్విల్వే గేట్లు ఎత్తి శారదానదిలోకి వరదనీటిని విడుదల చేసే అవకాశం ఉందని, నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ, గొర్రుపోటు పార్థసారథి తదితర సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రైవాడను సందర్శించారు.

జలదిగ్బంధంలోనే గిరిజన గ్రామాలు



వర్షాలు తగ్గినా ఉధృతంగా ఉరకగెడ్డ ప్రవాహం

మాడుగుల రూరల్ : తుఫాన్ ప్రభావం వల్ల ఉరకగెడ్డ ప్రవాహం వల్ల గిరిజన శివారు గ్రామాలు ప్రజలు నేటికీ జలదిగ్బంధంలోనే ఉన్నారు. మండలంలో శంకరం గ్రామ పంచాయతీ శివారు వెలగలపాడు, కొత్తవలస, గొప్పూరు, తాడివలస, రాయి పాలెం, మామిడిపాలెం గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయా యని శంకరం గ్రామ సర్పంచ్, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ విభాగం అధ్యక్షుడు శోలం రమేష్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వీఆర్వో గెడ్డ ఆవలి వైపునకు వచ్చి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారని సర్పంచ్ తెలిపారు. గెడ్డ నీటి ప్రవాహం తగ్గిన తర్వాత మాత్రమే ఈ గ్రామాల ప్రజలు ఇవతలి వైపునకు వస్తారన్నారు. ఉరకగెడ్డ మీద బ్రిడ్జి నిర్మించాలని సర్పంచ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి



గిరిజన గ్రామాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: పీఎం జన్‌మన్ కార్యక్రమాలు గిరిజన గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మంగళవారం జాలంపల్లి పంచాయతీలో బుట్ల జాలంపల్లి, కామకూటం గిరి గ్రామాల్లో పీఎం జన్ మన్ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే రహదారులు, అందరికి విద్య, ప్రతి ఇంటికి విద్యుత్, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, సుకన్య సమృద్ధి యోజన పథకాల గురించి గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన వారిని గుర్తించి పథకాలు అందజేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా మల్లేశ్వరి చిన్ని, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరభద్రపేట రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేట గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించేందుకు అధికార యంత్రాంగం కదిలింది. తమ గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజనులు రెండు రోజుల క్రితం బురదలో కూర్చొని నిరసన తెలపడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ అధికారి రెహమాన్ సమక్షంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు 900 మీటర్ల మేర మెటల్ రోడ్డు, మూడు చోట్ల కల్వర్టుల నిర్మాణానికి కొలతలు తీశారు. ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా అధికారులకు పంపించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పేరిట గిరిజనులను మోసగించడం పరిపాటిగా మారిందన్నారు. గిరిజనులు ఆందోళన చేపట్టిన సమయంలో వారిని శాంతింపజేసేందుకు ఇలా ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్టు హడావిడి చేయకుండా చిత్తశుద్ధితో వ్యవహరించాలని పాలకులకు సూచించారు.

రైవాడ విద్యార్థినికి ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని శ్రుతి

దేవరాపల్లి : పదో తరగతిలో 561 మార్కులు సాధించిన రైవాడ గ్రామంలోని యాదవ సామాజిక వర్గంకు చెందిన దుక్క శృతి ప్రతిభా పురస్కారాన్ని అందుకుంది. జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లిలో లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకుడు భరణికాన సాయినాధరావు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా శృతితో పాటు తల్లిదండ్రులు ఈశ్వరరావు, నాగమణిలను జిల్లా యాదవ సంఘం నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల వితరణ



దాత అందించిన బ్యాగ్‌లతో విద్యార్థులు

దేవరాపల్లి: మండలంలోని పాత వాలాబు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కాదల దిలీప్ కుమార్ బ్యాగ్‌లను వితరణగా అందజేశారు. స్థానిక పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు దండెనాయుడు చేతుల మీదుగా మంగళవారం వాటిని అందజేశారు. తన భార్య పుట్టిన రోజు సందర్భంగా విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం పట్ల దిలీప్‌కుమార్‌ను అందరూ అభినందించారు.

నూతన ఎస్ఐని కలిసిన ఎంపీపీ, జెడ్పీటీసీ



దేవరాపల్లి ఎస్ఐ మల్లేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం, బాబూరావు

దేవరాపల్లి: దేవరాపల్లి ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టి.మల్లేశ్వరరావును స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గూడెపు రాము, చింతల సత్య వెంకటరమణ, నాగిరెడ్డి శరారినాయుడు, ఎంపీటీసీలు రొంగలి నారాయణమ్మ, పంచాడ సింహాచలంనాయుడు, బండి గౌరమ్మ, నాయకులు దేముడునాయుడు, లలితానాయుడు, బండారు ప్రసాదరావు పాల్గొన్నారు.

సీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కె.కోటపాడు సీహెచ్‌సీ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

కె.కోటపాడు: ఏపీ వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని స్టాఫ్ నర్సు ధనరాజ్యలక్ష్మి అన్నారు. సీహెచ్‌సీలో గల స్టాఫ్ నర్సుల సమస్యల పరిష్కారానికి రెండో రోజు మంగళవారం ఆస్పత్రి ఎదుట నిరసన కార్యక్రమం జరిపారు. ప్లకార్డులను పట్టుకుని జీవో నంబర్ 115ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులను నేటికి రెగ్యులరైజేషన్‌ను ప్రభుత్వం చేపట్టకపోవడం శోచనీయమన్నారు. వందలాది కుటుంబాలకు మేలు చేసేలా స్టాఫ్ నర్సులను రెగ్యులరైజేషన్‌ను చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్‌లు నాగమణి, అప్పలనర్స, ప్రధాని, పుష్ప కళ, రేవతి, పార్వతి సంధ్య, సత్యవతి పాల్గొన్నారు.

13న వ్యాసరచన పోటీలు

నర్సీపట్నం : ఈ నెల 16న జరగనున్న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని గ్రీన్ క్లబ్ అధ్యక్షుడు డి.గోపీనాథ్ తెలిపారు. పోటీలు ఈ నెల 13న నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ మెయిన్ నందు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అందరూ పాల్గొనవచ్చన్నారు.

మేలు జాతి పశువుల పెంపకం చేపట్టాలి



మాట్లాడుతున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

కె.కోటపాడు : పాడి రైతులు మేలు జాతి పాడి పశువుల పెంపకం చేపట్టాలని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. బత్తివానిపాలెంలో మంగళవారం కె.కోటపాడు, దేవరాపల్లి, లక్కవరపుకోట, వేపాడ మండలాల పాల సంఘాల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ పరిధిలో గల సభ్య రైతుల పశువులకు ఆడపెయ్యిల ఉత్పత్తి పథకంలో భాగంగా తక్కువ ధరకే వీర్యాన్ని అందించే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విధానం ద్వారా 95శాతం పశువులకు ఆడపెయ్యిలు జన్మించి పాడి రైతులకు ఆదాయ వనరుగా మారుతుందన్నారు. విశాఖడెయిరీ పరిధిలో గల ప్రతి రైతు కుటుంబానికి ఎల్లప్పుడూ మేలైన కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. సంస్థ బోర్డు డైరెక్టర్లు సుందరపు గంగాధర్, కాటమయ్య, శీరంరెడ్డి సూర్యనారాయణ, శరగడం శంకరరావు, దాడి పవన్‌కుమార్, రెడ్డి రామకృష్ణ, జనరల్ మేనేజర్ కుమార్, పాండ్యరాజన్, మేనేజర్ అప్పారావు, పలు సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో

ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : విజయవాడలో వరద నుంచి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మండిపడ్డారు. మంగళవారం సాక్షితో మాట్లాడుతూ తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజలు ముంపు బారినపడ్డారని అన్నారు. ప్రభుత్వ పెద్దల ఆస్తులను కాపాడుకునేందుకు బుడమేరు వాగు గేట్లు ఎత్తి వేయించి విజయవాడను ముంచేశారన్నారు. బుడమేరుతో ప్రమాదం పొంచి ఉందని అధికారులు హెచ్చరించినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. వరద వస్తుందని ముందుగా చెప్పి ఉంటే జాగ్రత్త పడేవారని, సహాయ చర్యల్లో ప్రభుత్వం బాధ్యతరాహిత్యంగా వ్యవహరించడంతో నేటికీ విజయవాడ వాసులు వరదనీటిలో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. వరద ప్రళయంతో అన్ని వర్గాల ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనీసం ఆహారం, తాగునీరు అందించకపోవడంతో వరద బాధితు లు ఆకలితో అలమటిస్తున్నారని, ప్రభుత్వం ముందుస్తు వరద హెచ్చరికలు చేసి ఉంటే ప్రజలు నష్టపోయే వారు కాదని తెలిపారు. ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, తాగునీరు పరఫరా చేశామని సీఎం చంద్రబాబు ప్రకటనలతో ఊదరగొడుతున్నారు తప్ప బాధితులకు అందించిన సహాయం శూన్యమని అన్నారు. వరదబాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మానుకుని వరద బాధితులకు సహాయం అందించాలన్నారు. వరద విపత్తు నష్టానికి కారణం ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం బాధ్యతా రాహిత్యమేనన్నారు. లక్షల మంది వరద బాధితులకు కనీస సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- తూతూ మంత్రంగా రోడ్డు గోతులు పూడ్చివేత



తూతూ మంత్రంగా కప్పిన గొయ్యి



కలెక్టర్ ఆదేశించినా పూడ్చని బంగారుమెట్ట జంక్షన్‌లో గోతులు

బుచ్చెయ్యపేట : రహదారిపై గోతుల్లో నీరు బయటకు పోయేలా చేసి గోతులను పూడ్చాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా అధికారులు అమలు చేయలేదు. స్వయాన జిల్లా కలెక్టర్ ఆదేశాలు అమలు చేయకపోవడంపై ఆర్అండ్‌బీ అధికారుల తీరును ప్రజలు ఎండగడుతున్నారు. అధిక వర్షాలతో నీటి ముంపునకు గురైన వడ్డాది,విజయరామరాజుపేట గ్రామాల్లో ముంపు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సోమవారం పరిశీలించారు. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో బంగారుమెట్ట మూడు రోడ్ల జంక్షన్ వద్ద పెద్దపెద్ద గోతులు, గోతుల్లో చేరిన వర్షం నీటిని చూసిన కలెక్టర్ వెంటనే గోతుల్లో నీరు బయటకు పోయేలా చేసి గోతులను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్అండ్‌బీ, మండల, పంచాయతీ అధికారులంతా వచ్చి గోతుల వద్ద పొక్లెయిన్‌లను తీసుకొచ్చి హడావిడి చేశారు. దీంతో గోతులకు మోక్షం కలుగుతుందని స్థానికులు సంతోషపడ్డారు. జంక్షన్‌లో ఉన్న పెద్ద గోతిలో నీటిని తొలగించి, రాయి బుగ్గితో అరకొరగా గోతులు పూడ్చి, మిగిలిన గోతులు అలాగే వదిలేశారు. 50 మీటర్లు ప్రదేశంలోనే 10 గోతులు వరకు ఉండగా అరకొరగా గోతులు పూడ్చి చేతులు దులిపేసుకోవడంపై ప్రజలు మండి పడుతున్నారు. స్వయాన జిల్లా కలెక్టర్ ఆదేశాలే అమలు కాకపోతే ఇక అభివృద్ధి ఏం జరుగుతుందని నిట్టూరుస్తున్నారు.

వారపు సంతల్లో పరిశుభ్రత పాటించాలి



కె.కోటపాడు వారపు సంతలో వ్యాపారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు: వర్షాకాలం నేపథ్యంలో వారపు సంతల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. కె.కోటపాడులో మంగళవారం నిర్వహిస్తున్న వారపుసంతలో కూరగాయలతో పాటు మాంసాహార అమ్మకాలు చేస్తున్న వ్యాపారులకు ఆయన సూచనలు చేశారు. అమ్మకాలు చేసే ప్రాంతాల్లో పరిశుభ్రత లేని సమయంలో అంటు వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. వారపుసంతల్లో అమ్మకాలు చేసే వారు తప్పనిసరిగా సమీపంలో డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మాంసాహారం విక్రయించేవారు ఆయా పదార్థాలపై ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్ పాల్గొన్నారు.

తిలక్ స్ఫూర్తిగా.. గణేషుడు తోడుగా...

- వినాయక ఉత్సవాల్లో చైతన్య స్ఫూర్తి
- బస్టాండ్ పునరుద్ధరణకు యువత ఉద్యమం



గణేష్ మండపం వద్ద బ్యానర్‌తో యువకులు

మాడుగుల: ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో బాలగంగాధర తిలక్ ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని తీసుకురావడానికి వినాయక చవితి మండపాల ద్వారా ఉద్యమం ప్రారంభించారు. ఈ రోజు ఆయన స్ఫూర్తిగా తీసుకుని స్థానిక డేరింగ్ బాయ్స్ యువకులు మాడుగులలో ఆర్టీసీ కాంప్లెక్స్ పునరుద్ధరణకు నడుంబిగించారు. వినాయక ఉత్సవాలు వేదికలో ప్రజల సహకారాన్ని అభ్యర్థిస్తున్నారు. మన గ్రామానికి ఆర్టీసీ కాంప్లెక్‌కు గతంలో విలువైన స్థలం కేటాయించారని, కాంప్లెక్స్‌కు రహదారి ఏర్పాటు చేయడానికి తమకు సహకరించాలని ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు అవగాహన పరుస్తున్నారు. ప్రజల్లో ఐకమత్యానికి బాలగంధర్ తిలక్ ఆశయాలను ప్రజలకు తెలియజేసేలా బ్యానర్‌లు రూపొందించి ఉత్సవ మండపం వద్ద ఏర్పాటు చేశారు. వారి కృషి నెరవేరేలా గణేషుడు ఆశీస్సులు అందించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో జ్వరాలు



తీవ్ర జ్వరంతో కటిక నేలపైనే పడుకున్న వృద్ధుడు



జ్వరంతో అరుగుపై పడుకున్న వృద్ధురాలు

దేవరాపల్లి: మండల పరిధిలోని గిరిజన గ్రామాలలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు దోమల బెడద విపరీతంగా పెరగడంతో వాలాబు, చింతలపూడి పంచాయితీల పరిధిలోని శివారు గ్రామాలలో పలువురు సాధారణ జ్వరాలతో పాటు మలేరియా బారినపడ్డారు. ప్రతి ఇంటికి ఒకరు లేదా ఇద్దరు చొప్పున జ్వరాల బారిన పడి మంచాన మగ్గుతున్నారు. తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో నరకయాతన అనుభవిస్తున్నారు. సక్రమంగా వైద్య సేవలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్త వాలాబు, జుత్తాడపాలెం, కొత్తబొడ్డపాడు, చినసోంపురం తదితర గ్రామాలలో పలువురు వృద్ధులు, మహిళలు జ్వరాలతో మగ్గుతున్నారు. గ్రామాలలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టక పోవడంతో పాటు వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే గ్రామాలలో జ్వరాలు వణికిస్తున్నాయని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా వైద్య సిబ్బంది స్పందించి గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.